సాక్షి
అనంతపురం
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



చెరువుల్లోకి చేప పిల్లలు

మత్స్య క్షేత్రాల్లో అభివృద్ధి చేసిన చేప పిల్లలను చెరువుల్లోకి ఉచితంగా వదిలే కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. ఆదివారం బి.యాలేరు, శ్రీధరఘట్ట చెరువుల్లో చేపలు వదిలారు.

8లో

గరిష్టం/కనిష్టం
34.4°/13.2°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

క్రీడోత్సవానికి వేళాయె

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా'లో యువత పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవుతోంది. ఇలాంటి కార్యక్రమం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.100 కోట్ల బడ్జెట్‌తో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలో 1,33,670 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారు.

- రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'
- ఫిబ్రవరి పదో తేదీ వరకు ఆటలే ఆటలు
- 663 సచివాలయాల పరిధిలో క్రీడల నిర్వహణ
- క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలు



అనంతపురంలో ఆదివారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' మారథాన్‌లో భారీ ఎత్తున పాల్గొన్న యువత

అనంతపురం: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగనన్న సర్కారు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి పదో తేదీ వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్, మారథాన్ తదితర విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. అందులో భాగంగా మంగళవారం అనంతపురం పీటీసీ గ్రౌండ్‌లో కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు అట్టహాసంగా ప్రారంభించనున్నారు. గ్రామ/ వార్డు సచివాలయాల పరిధిలో రేపటి నుంచి జనవరి 9 వరకు (15 రోజులు), మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23 వరకు (14 రోజులు), నియోజకవర్గ స్థాయిలో జనవరి 24 నుంచి 30 వరకు (7 రోజులు), జిల్లా స్థాయిలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 6 వరకు (6 రోజులు), రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు (5 రోజులు) ఆదివారాలు, పండుగలు మినహాయించి 47 రోజులు సుదీర్ఘంగా పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల మ్యాచ్‌లు నిర్వహించనుండగా.. ఒక్క అనంతపురం జిల్లాలోనే 663 గ్రామ/ వార్డు సచివాలయాల పరిధిలో 20 వేల మ్యాచ్‌లు జరగనున్నాయి.

విజేతలకు బహుమతులిలా..

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ విజేతలకు వరుసగా రూ. 5లక్షలు, రూ.3లక్షలు, రూ.2 లక్షలు ఇవ్వనున్నారు.

క్రీడా పరికరాలు సిద్ధం..

'ఆడుదాం ఆంధ్రా' టోర్నీలో భాగంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాస్థాయి పోటీలకు 26,364 క్రీడా పరికరాలు ఉన్నాయి. నియోజకవర్గ స్థాయి పోటీలకు సంబంధించి ఒక్కో నియోజకవర్గానికి 6,280 క్రీడా పరికరాలు, మండల స్థాయి పోటీలకు సంబంధించి ఒక్కో మండలానికి 2,475 క్రీడా పరికరాలు, సచివాలయ స్థాయి పోటీలకు గాను ఒక్కో సచివాలయ పరిధిలో 12,529 క్రీడా పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. మొత్తం 663 క్రికెట్ క్లబ్‌లు ఏర్పాటయ్యాయి.

- జిల్లాలో మొత్తం 321 ఆటస్థలాల్లో పోటీలు జరగనున్నాయి. 6,630 మంది వలంటీర్లు, 284 మంది ఫిజికల్ డైరెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు క్రీడా పోటీల నిర్వహణలో నిమగ్నమయ్యారు. 1,51,164 మంది పాల్గొనేలా లక్ష్యం నిర్దేశించగా 1,33,670 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇందులో కాంపిటేటివ్ విభాగంలో 1,00,717 మంది ఉన్నారు. తక్కిన వారు నాన్ కాంపిటేటివ్ విభాగంలో పాల్గొంటారు. పురుషుల లక్ష్యం 75,582 మంది కాగా, 74,441 మంది (98.49 శాతం) పాల్గొననున్నారు. 75,582 మంది మహిళలకు గాను 26,276 మంది క్రీడల్లో పాల్గొననున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు



కలెక్టర్ ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. జిల్లాలో మొత్తం 321 ఆట స్థలాలను సిద్ధంగా ఉంచాం. క్రీడలపై యువత ఆసక్తి ఏర్పరచుకునేలా 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతంగా నిర్వహించాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు.

– పి.నరసింహారెడ్డి, చీఫ్ కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, అనంతపురం

క్రీడలతో ఉజ్వల భవిత

అనంతపురం కార్పొరేషన్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో క్రీడలు నిర్వహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో శ్రీకారం చుట్టింది. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే మెగా టోర్నీకి మద్దతుగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో మారథాన్ చేపట్టారు. యువకులు, క్రీడాకారులు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నందిని హోటల్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య, క్రీడా, అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా క్రీడాకారులను ప్రోత్సహించేలా 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహిస్తుండటం గొప్ప విషయమన్నారు. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది నైపుణ్యం కల్గిన క్రీడాకారులు ఉన్నారని, వారి శక్తి సామర్థ్యాలను వెలికితీయడానికి 'ఆడుదాం ఆంధ్రా' ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మారుతీనాయుడు, జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు కేశవరెడ్డి, షెక్షావలి, ఐటీ వింగ్ చంద్రమోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, నాయకులు పెన్నోబులేసు, దాదు పాల్గొన్నారు.



మారథాన్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా నరసింహయ్య, యువజన, విద్యార్థి విభాగం నేతలు ప్రణయ్‌రెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు

కల్తీ, నకిలీ వస్తువులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: వస్తువుల కొనుగోలులో మోసపోకుండా కల్తీ, నకిలీని గుర్తించాలని వినియోగదారులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. ప్రధానంగా వినియోగదారుల హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. జాతీయ వినియోదారుల వారోత్సవాలను పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ ఆదివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సరఫరాల అధికారి శోభారాణితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమార్జనకు అలవాటుపడిన కొందరు వ్యాపారులు కల్తీ, నకిలీ వస్తువులను అంటగట్టి వినియోగదారులను మోసం చేస్తుంటారన్నారు. ఈ విషయాన్ని గమనించాలన్నారు. కొనుగోలు చేసే ముందు వస్తువులు సరైనవా లేదా అనేది పరిశీలించాలని చెప్పారు. కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వ్యాపారస్తులు మోసం చేసినట్లయితే బిల్లు ఆధారంగా వినియోదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ పేమెంట్ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

బహుమతుల ప్రదానం..

జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా ఈ నెల 18 నుంచి 24 వరకు కళాశాలలు, పాఠశాలల్లో వినియోదారుల చట్టంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు బహుమతిని జాయింట్ కలెక్టర్ అందజేశారు. సమావేశంలో అధికారులు, వినియోగదారుల ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

- క్రిస్మస్ వెలుగులు



అనంతపురం విద్యుత్‌నగర్‌లో విద్యుత్ దీపాల కాంతులతో ముస్తాబైన సీఎస్‌ఐ చర్చి

క్రీస్తు విశ్వాసుల అతి ముఖ్యమైన పండుగ క్రిస్మస్. సోమవారం నాటి క్రిస్మస్ వేడుకలకు జిల్లా అంతటా చర్చిలు ముస్తాబయ్యాయి. చర్చిలతో పాటు క్రైస్తవుల ఇళ్లు విద్యుద్దీప కాంతులతో క్రిస్మస్ స్టార్లతో కాంతులీనుతున్నాయి. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పండుగ వేళ వస్త్ర దుకాణాలు, క్రిస్మస్ ట్రీ, స్టార్ తదితర షాపులు కిటకిటలాడాయి.

– అనంతపురం కల్చరల్



నెట్టికంటి ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్న దృశ్యం



హనుమద్ వత్రంలో పాల్గొన్న భక్తులు, మాలధారులు

శోభాయమానం.. హనుమద్వ్రతం

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమద్వ్రతం శోభాయమానంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన హనుమాన్ మాలధారులతో ఆలయ పరిసరాలు కాషాయవర్ణంతో కాంతులీనింది. గంగా నిలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై విశేష పుష్పాలంకరణ గావించి నెట్టికంటి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణల నడుమ హనుమద్ వ్రతం నిర్వహించారు. మాలధారులు సమర్పించిన ఇరుముడిలోని ద్రవ్యాలతో ఉత్సవమూర్తిని అభిషేకించారు. మూలవిరాట్‌ను స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ గురప్రసాద్, ఏఈఓ మల్లికార్జున, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కే.సుగణమ్మ, సభ్యులు పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్‌ఐలు సురేష్‌కుమార్, దుగ్గిరెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మంత్రి క్రిస్మస్ శుభాకాంక్షలు



ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం/అనంతపురం అర్బన్ : రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత జీవనం, ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు మనుషులను సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలంటూ జిల్లా కలెక్టర్ గౌతమి ఒక ప్రకటనలో సూచించారు.

నేడు 'స్పందన' ఉండదు

అనంతపురం అర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ సెలవు ఉన్నందున, ఆ రోజున కలెక్టరేట్‌లో జరగాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు డీఆర్‌ఓ గాయత్రీదేవి తెలియజేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

అనంతపురం టవర్‌క్లాక్: అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమకు రావలసిన హక్కులను సాధించుకోవడం కోసం బుధవారం ఉదయం పది గంటలకు అనంతపురం లలితకళాపరిషత్‌లో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, మేధావులు, నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజా, వెంకటసుబ్బయ్య, కేవీ కుమార్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో జీవించండి



అనంతపురంలో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎస్పీ అన్బురాజన్ హెచ్చరించారు. 'ఏ' కేటగిరీ రౌడీషీటర్లు, కిరాయి హంతకులను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆయా స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి జీవన విధానం, స్థితిగతులపై ఆరా తీశారు. సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని ఎస్పీ సూచించారు. అలా కాదని ఎవరైనా పాత పంథాలోనే నడిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

భక్తరహళ్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ధ్వజారోహణ, అంకురార్పణ పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హనుమంతయ్య, రామాంజనప్ప కుటుంబసభ్యులు, ఆంజనేయస్వామి ఆలయంలో గోవిందరాజులు, రత్నమ్మ కుటుంబ సభ్యులతో పురోహితులు హోమం, హనుమద్ వ్రతం గావించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆంజనేయస్వామి దేవాలయంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రప్రసాదరావు, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, రథోత్సవ కమిటీ చైర్మన్ నాగభూషణ, భక్తులు పాల్గొన్నారు.

లేపాక్షికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి

- కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవుసింగ్ చౌహాన్



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి దేవుసింగ్ చౌహాన్

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవుసింగ్ చౌహాన్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయాన్ని ఆయన సందర్శించారు. శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో వీరభద్రస్వామి, దుర్గాదేవి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. లేపాక్షి ఆలయ సందర్శనకు ఇతర దేశాల నుంచి కూడా అనేక మంది పర్యాటకులు విచ్చేస్తుంటారన్నారు. ఆలయానికి మరింత గుర్తింపు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేస్తామన్నారు. ఇందుకోసం సమన్వయంతో పనిచేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రూ.1.45 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీడీఓ నరసింహనాయుడు, డిప్యూటీ తహసిల్దార్ కుమార్‌స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీలకు కసరత్తు

- జాబితా తయారీలో జిల్లా యంత్రాంగం

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారుల బదిలీ ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల విధుల్లో భాగమైన అధికారులను తప్పనిసరిగా బదిలీ చేస్తారు. ప్రధానంగా ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలుగా డిప్యూటీ కలెక్టర్లు, ఏఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలుగా తహసీల్దార్లు వ్యవహరిస్తారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణ కమిటీలకు నోడల్ అధికారులుగా జిల్లా అధికారులు ఉన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారుల జాబితాను బదిలీల కోసం సిద్ధం చేయనున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఇందులో ఎంత మంది ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారు.. సొంత జిల్లా అధికారులు ఎంత మంది.. జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు ఎందరు... మూడేళ్ల సర్వీసు పూర్తికానున్న వారు ఎంత మంది... ఇతర జిల్లాల నుంచి బదిలీపై ఎంతమంది జిల్లాకు వచ్చారు.. వారిలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు ఎందరు..? తదితర వివరాలకు సంబంధించి సమగ్ర నివేదికను రూపొందిస్తారు. ఈ ప్రకారం సిద్ధం చేసిన జాబితాను ఆయా శాఖల ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు పంపిస్తారు.

బదిలీలు... పోస్టింగ్‌లు ఇలా..

ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఇతర అధికారుల బదిలీలకు సంబంధించి ఆయా శాఖల రాష్ట్ర అధికారులు చర్యలు తీసుకుంటారు. బదిలీకి అర్హులైన అధికారుల జాబితాను ప్రభుత్వానికి పంపిస్తామని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక బదిలీ, పోస్టింగ్ ఉత్తర్వులు అక్కడి నుంచే వెలువడతాయని పేర్కొంటున్నాయి. రెవెన్యూకు సంబంధించి సీసీఎల్‌ఏ (భూ పరిపాలన శాఖ కమిషనర్) ఇస్తారని, అదే విధంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు తమ శాఖ అధికారుల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు ఇస్తారని వెల్లడించాయి.

క్లుప్తంగా

నాలుగు ఇళ్లల్లో చోరీ

బెళుగుప్ప: మండల పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న రెండు గ్రామాల్లోని నాలుగు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. హనిమరెడ్డిపల్లిలో రోడ్డు పక్కనే నివాసముంటున్న బోయ ఓబులేసు శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పొరుగునే ఉన్న మానిరేవులో నాటకాన్ని చూసేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు లోపలకు చొరబడి బీరువాలోని 17 గ్రాముల బరువున్న ఐదు జతల బంగారు కమ్మలు, రెండు తులాల వెండి సామగ్రి, బోయ ఎర్రిస్వామి ఇంటి వెనుక ఉన్న పశువుల కొట్టంలో నిద్రిస్తుండగా ఇంట్లోకి చొరబడిన దుండగులు 6 గ్రాముల బంగారు కమ్మలు, 14 తులాల వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. అలాగే కాలువపల్లిలో చిరు వ్యాపారి రాఘవేంద్ర ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దుండగులు లోపలకు చొరబడి 8 తులాల బంగారు, 720 గ్రాముల వెండి వస్తువులను, ఆ పక్కనే నివాసముంటున్న మధుసూన్‌రెడ్డి మేడపై నిద్రిస్తుండడం గమనించి ఇంట్లోకి చొరబడి అందిన వస్తువులను అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, బెళుగుప్ప ఎస్‌హెచ్‌ఓ రామదాసు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఘర్షణలో వ్యక్తి మృతి


మృతుడు రామాంజినేయులు

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనాన్ని మరమ్మతు చేసే అంశంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ప్రభాకర్ కుమారుడు ద్విచక్ర వాహనాల మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రామాంజినేయులు(56) తన ద్విచక్ర వాహనాన్ని మరమ్మతుకు ఇచ్చాడు. అయితే బైక్ మరమ్మతు చేయడంలో ఆలస్యం చోటు చేసుకోవడంతో ఆగ్రహానికి లోనైన రామాంజినేయులు ఆదివారం ఉదయం ప్రభాకర్ ఇంటి వద్దకెళ్లి గొడవపడ్డాడు. తీవ్ర పదజాలంతో దూషించడంతో ప్రభాకర్ సహనం కోల్పోయి దాడి చేశాడు. ఘటనతో అపస్మారక స్థితికి చేరుకున్న రామాంజినేయులును స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ప్రభాకర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం

చెన్నేకొత్తపల్లి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా శింగనమల మండలం పెరవలి గ్రామానికి చెందిన గుంటిక వేణుగోపాల్, బ్రహ్మేంద్ర ఆదివారం వేకువజామున ఆటోలో పూలు లోడు చేసుకుని హిందూపురానికి బయలుదేరారు. మార్గమధ్యంలో చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని ప్యాదిండి అంజనేయస్వామి గుడి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వేణుగోపాల్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ బ్రహ్మేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై సీకే పల్లి ఎస్‌ఐ శ్రీధర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వీరి 'బండ' బడా!

- రుద్రంపేటలో నివాసముంటున్న మల్లికార్జున (పేరు మార్చాం) ఇంటికి నగరంలోని ఓ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వెళ్లారు. మీ గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి రూ.200 ఇవ్వాలని అడిగారు. ఎందుకు అంటే ఇన్సూరెన్స్ అని సమాధానం ఇచ్చారు. డబ్బు కట్టకపోతే కనెక్షన్ రద్దవుతుందని చెప్పారు. దీంతో చేసేదిలేక మల్లికార్జున రూ.200 చెల్లించాడు.
- రుద్రంపేటలోని మరో వినియోదారుడు రాజేశ్ (పేరు మార్చాం) ఇంటికీ వెళ్లారు. మీకు రెండు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రూ.400 ఇవ్వాలన్నారు. ఎందుకివ్వాలని రాజేశ్ ప్రశ్నిస్తే ఇన్సూరెన్స్ కోసం కట్టాలని చెప్పారు. అనుమానం వచ్చిన రాజేశ్ నేను తరువాత కడతాననగా.. మీ ఇష్టం కట్టకపోతే గ్యాస్ కనెక్షన్లు రద్దవుతాయంటూ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

- బీమా పేరుతో ఓ ఆయిల్ కంపెనీ గ్యాస్ ఏజెన్సీ 'దందా'
- ఒక్కో కనెక్షన్‌కు రూ.200 వసూలు
- ఇవ్వకపోతే కనెక్షన్ రద్దవుతుందంటూ బెదిరింపు



అనంతపురం అర్బన్: వినియోగదారులకు ఇప్పటికే వంట గ్యాస్ బండ ధర గుదిబండగా మారింది. గోరుచుట్టుపై రోకటి పోటులా ఆయిల్ కంపెనీలు మరో దందాకు తెరతీశాయి. వినియోదారుల నుంచి గ్యాస్ కనెక్షన్‌కు రూ.200 వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే ఓ ఆయిల్ కంపెనీకి చెందిన గ్యాస్ ఏజెన్సీ బీమా పేరుతో వసూళ్లు ప్రారంభించింది. జిల్లాలో మొత్తం 6.67 లక్షలకు పైనే వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అన్ని ఆయిల్ కంపెనీలు తమ వినియోగదారుల నుంచి రూ.200 వసూలు చేస్తే మొత్తం రూ.13.35 కోట్లవుతుంది.

దాక్యుమెంట్ ఇవ్వకుండానే..

డబ్బులు వసూలు చేస్తున్న కంపెనీ సిబ్బంది ఊరికే తమ వద్ద ఉన్న లిస్ట్‌లో టిక్ వేసుకుంటున్నారు. ఎందుకు డబ్బివ్వాలని అడిగితే ఇన్సూరెన్స్ అంటూ చెబుతున్నారే తప్ప... అందుకు సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్ ఇవ్వడం లేదు. బీమా పేరుతో డబ్బులు కట్టించుకుంటే తప్పనిసరిగా వినియోగదారుని పేరున ఇన్సూరెన్స్ డాక్యుమెంట్ ఇవ్వాల్సి ఉన్నా.. అదేం చేయకపోవడం గమనార్హం.

అధికారులకు ఫిర్యాదులు

బీమా దందాపై ఇప్పటికే పలువురు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారని తెలిసింది. వసూలు చేస్తోంది బీమా కోసం కాదు. సర్వీసు రుసుమని చెప్పినట్లు సమాచారం. అయితే, సర్వీసు అంటే.. వినియోదారుని ఇంటి వెళ్లి వారి గ్యాస్ సిలిండర్, సిలిండర్ వాచర్, రెగ్యులేటర్, పైప్, స్టవ్ పరిశీలించాలి. గ్యాస్ లీకవుతుంటే ఏం చేయాలి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు ఇలా..	
ఐఓసీఎల్	3,58,936
హెచ్‌పీసీఎల్	1,29,795
బీపీసీఎల్	1,78,557
మొత్తం కనెక్షన్లు	6,67,288

విషయాలపై వినియోదారునికి అవగాహన కల్పించాలి. అలాంటిది ఏమీ లేకుండా డబ్బు తీసుకుని లిస్ట్‌లో టిక్ వేసుకుని వెళ్లిపోతున్నారు.

సమాచారం కూడా లేదు!

ఆయిల్ కంపెనీలు సర్వీసు అందిస్తున్నా.. అందుకు చార్జీలు వసూలు చేస్తున్నా, ముందుగా ఆ విషయాన్ని వినియోదారులకు వివిధ మాధ్యమాల ద్వారా సమాచారం ఇవ్వాలి. ఫీజుగా ఎంత తీసుకుంటారో తెలియజేయాలి. అయితే ఆ సమాచారం ఏదీ ఇవ్వకుండానే వసూలు చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో అధికారుల ఆదేశాలనూ ఆయిల్ కంపెనీలు బేఖాతరు చేస్తున్నట్లు కార్యాలయవర్గాలే చెబుతున్నాయి.

వసూలు నిలిపివేయాలని చెప్పాం



వినియోదారుల నుంచి డబ్బు వసూలు నిలిపివేయాలని మూడు ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లను ఆదేశిలిచ్చాం. వసూలు చేసే ముందు ఆ విషయం గురించి ప్రజలకు ప్రసార మాధ్యమాల ద్వారా తెలిజేయాలని ఆదేశించాం. అంత వరకు ఎలాంటి ఫీజు వసూలు చేయకూడదని, కాదని చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించాం.

– శోభారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి

ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం రూరల్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న కంప్యూటర్ శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అకాడమీ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మైనార్టీ, ఇతర బలహీన వర్గాలకు చెందిన వారు అర్హులు. పదో తరగతి ఉత్తీర్ణులై 40 సంవత్సరాల లోపు వయసుండాలి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలి. పూర్తి సమాచారానికి 83280 28735, 83820 75558లో సంప్రదించవచ్చు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: స్థానిక వడ్డే కాలనీకి చెందిన మాధవి ఆత్మహత్యాయత్నం చేసింది. 20 ఏళ్ల క్రితం ఆమెకు సోమనాథ్‌తో వివాహమైంది. సంతానం కలగకపోవడంతో రోజూ భర్త మానసికంగా వేధించేవాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపూరిత ద్రావకం తాగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

27న అగ్రికల్చర్ ఫాం వరిగడ్డి వేలం

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫాం వరిగడ్డిని ఈనెల 27న వేలం వేయనున్నట్లు ఏడీఏ నారాయణనాయక్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఎస్‌ఎంఎఫ్, పీడీడీఎఫ్ ఫారాల్లో 135 ఎకరాల్లో వరిసాగు చేశామని, ఆ వరిగడ్డిని బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఏడీఏ ఫాం పేరిట రూ.లక్ష డీడీ తీసి కార్యాలయంలో సమర్పించాలన్నారు. 27వ తేది మధ్యాహ్నం 12.30 గంటలకు వేలం పాట ఉంటుందన్నారు. అదనపు వివరాల కోసం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

'పీపీఆర్'తో జీవాలకు నష్టం

- జనవరి 20 వరకు ఉచితంగా టీకాలు
- పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం


గొర్రెల్లో పీపీఆర్ లక్షణాలు

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల్లో పీపీఆర్ (పెస్టె డెస్‌పెటిట్స్ రూమినెంట్స్) వ్యాధి విస్తరిస్తోందని, దీని వల్ల పెంపకందారులు నష్టపోయే ప్రమాదముందని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆదివారం ఆయన 'సాక్షి'కి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారుడురోగం, ముసరవ్యాధి, నోటిపుండ్ల వ్యాధి అని రకరకాలుగా పిలిచే ఈ వైరస్ ప్రభావం ఫిబ్రవరి నుంచి మే మధ్య ఎక్కువగా కనిపిస్తుందన్నారు. వ్యాధి బారిన పడితే గొర్రె, మేక పిల్లల్లో మరణాల శాతం అధికంగా ఉంటుందని వివరించారు. ఒక గొర్రె నుంచి మరోదానికి వ్యాప్తి చెంది 4 నుంచి 10 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయని తెలిపారు. సాధారణంగా కొత్తగా కొనుగోలు చేసిన గొర్రెలను మందలో చేర్చిన తరువాత ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఎక్కువన్నారు. ఈ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా జీవాలకు ఉచితంగా పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ నెల రోజుల పాటు కొనసాగుతున్నందున కాపర్లు తప్పనిసరిగా తమ జీవాలకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 22.94 లక్షలు గొర్రెలు, 4.12 లక్షల వరకు మేకలు ఉండగా.. అందుకు సరిపడా వ్యాక్సిన్‌ను అన్ని పశుశాఖ ఆసుపత్రులకు అందజేసినట్లు వివరించారు. జనవరి 20 లోపు ఉచిత టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జనవాక్కు

ఇంటి వద్దకే సంక్షేమం



జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారు. నాకూ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 ఆర్థిక సాయం అందుతోంది. ఈ డబ్బును పెట్టుబడిగా పెట్టి పంటలు సాగు చేస్తున్నా. నా భార్య పేరుతో ఇంటి పట్టాతో పాటు పక్కా గృహ నిర్మాణం మంజూరు చేశారు. దీంతో సొంతింటి కల నెరవేరింది. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగింది. ఇంతకంటే ప్రజలకు మేలు చేసే సీఎం మరొకరు దొరకరు. ఆయనే మళ్లీ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా.

– రామకృష్ణ, కడమలకుంట, వజ్రకరూరు మండలం

మళ్లీ సీఎం వైఎస్ జగనే



అర్హతే ప్రామాణికంగా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సంక్షేమ పాలనను గతంలో ఎన్నడూ చూడలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. అమ్మ ఒడి పథకంతో నా కుమార్తె చదువు సజావుగా సాగుతోంది. మా అమ్మ నీలమ్మకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 మంజూరు చేశారు. మా నాన్న వెంకట్రాముడికి వైఎస్సార్ రైతుభరోసా కింద ఏటా 13,500 అందజేశారు. ఎలాంటి సిఫారసు లేకుండా ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం మారితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయి. అందుకే ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌నే ఎన్నుకోవాలి.

– కె.నాగరాజు, వజ్రకరూరు

జీవనాధారం దొరికింది



సీఎం వైఎస్ జగన్ ఇస్తున్న పింఛన్ సొమ్మునే నాకు జీవనాధారంగా మారింది. పింఛన్ వస్తోందనే కుటుంబసభ్యులు నన్ను బాగా చూసుకుంటున్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి రూ.3 వేలు పింఛన్ అందుతుందని చెబుతున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– నాగేశ్వరమ్మ, ముదిగుబ్బ

ప్రాణాలు పోశారు



సీఎం వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యశ్రీ పథకం నా ప్రాణాలు కాపాడింది. ప్రమాదవశాత్తు నేను జారి కిందపడడంతో కాలు విరిగి నడవలేకపోయాను. ఆస్పత్రికి వెళ్లి చూపిస్తే ఆపరేషన్ చేయాలని, రూ. లక్ష వరకూ ఖర్చు వస్తుందని చెప్పారు. ఆ సమయంలో ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్య మిత్ర నన్ను కలిసి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తారని చెప్పి నా ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం నేను బాగా నడవగలుగుతున్నా. టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా వర్తించకపోవడంతో నాలాంటి పేదలు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ రుణం మరిచిపోలేనిది.

– సుశీలమ్మ, తప్పెటవారిపల్లి, ముదిగుబ్బ మండలం

ఆధ్యాత్మిక పర్తికి క్రిస్మస్ శోభ

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి క్రిస్మస్ శోభ సంతరించుకుంది. వివిధ దేశాలకు చెందిన సత్యసాయి భక్తులు సత్యసాయి సన్నిధిలో క్రిస్మస్ పర్వదిన వేడుకలను నిర్వహించుకునేందుకు తరలివచ్చారు. సాయికుల్వంత్ సభా మందిరంతో పాటు ప్రశాంతి నిలయంలోని గడ్డి మైదానాలు, విదేశీ భక్తులు సంచరించే ప్రాంతాలను ప్రత్యేక విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ రూపాలు, క్రీస్తు జననం వివరించే రీతిలో నమూనాలను ఏర్పాటు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సత్యసాయి సన్నిధిలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేయనున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు విదేశీ భక్తులు ప్రశాంతి నిలయంలోని సత్సంగ్ భవన్‌లో ఆదివారం ప్రత్యేక సాధన చేశారు.


ప్రశాంతి నిలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ వద్ద విదేశీ భక్తుల సందడి


సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం


క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న సత్యసాయి విదేశీ భక్తులు


వెస్టర్న్ క్యాంటీన్‌లో సర్వధర్మాన్ని పాటిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శన


క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరించే ప్రత్యేక ఘట్టం

ఘనంగా పాఠశాల స్వర్ణోత్సవం

అగళి: మండలంలోని మధుడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా సాగాయి. పూర్వ విద్యార్థులు గ్రామంలో ఎటు చూసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు కట్టి సంబరం చేశారు. భారీ షామియానాల కింద వేలాది మంది పూర్వ విద్యార్థులు చేరి జాతరను తలపించారు. 1973 నుంచి 2023 వరకూ ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులతో పాటు అప్పటి నుంచి ఇప్పటి వరకూ పనిచేసిన ఉపాధ్యాయులను బ్యాచ్‌ల వారీగా వేదికపై ఆహ్వానించి సత్కరించారు. ఒకేసారి చిన్ననాటి స్నేహితులందరూ కలవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. ప్రధానోపాధ్యాయుడు దాసేగౌడ్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో చదువుకున్న వారు ఎంతో మంది డాక్టర్లుగా, చార్టెడ్ అకౌంటెంట్లుగా, ఇంజినీర్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, పోలీసు ఉద్యోగులుగా, శాస్త్రవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, వ్యాపారవేత్తలుగా స్థిరపడడం ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పూర్వ విద్యార్థులు అలరించారు.


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చెరువుల్లోకి ఉచితంగా చేపపిల్లలు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మత్స్యశాఖ క్షేత్రాల్లో అభివృద్ధి చేసిన చేపపిల్లలను చెరువుల్లోకి ఉచితంగా వదిలే కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం ఆత్మకూరు మండలం బి.యాలేరు చెరువులోకి 1.42 లక్షలు, బొమ్మనహాల్ మండలం శ్రీధరఘట్ట చెరువులోకి 16,400 చేపపిల్లలు వదిలారు. ఇప్పటికే పాతకొత్తచెరువు, చాగల్లు రిజర్వాయర్‌లోకి ఉచితంగా చేపపిల్లలు వదిలారు. మూడు నెలల వయస్సున్న ఫింగర్‌లింగ్స్ పిల్లలను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ఉచితంగా వదిలినట్లు పీఏబీఆర్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) పెద్దబాబునాయక్ తెలిపారు. ఫిషరీస్ డీడీ ఆదేశాల మేరకు మత్స్యకార సహకార సంఘాల పరిధిలో ఉన్న మరికొన్ని చెరువులు, రిజర్వాయర్లలో త్వరలో చేపపిల్లలు వదలనున్నట్లు తెలిపారు. బి.యాలేరులో జరిగిన కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వై.జనార్ధన్‌రెడ్డి, ఎఫ్‌డీఓలు, ఆసీఫ్ లక్ష్మీనారాయణ హాజరు కాగా, శ్రీధర్‌ఘట్టలో జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌డీఓ పెద్దబాబునాయక్, ఎంపీపీ, సర్పంచ్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.


శ్రీధర్‌ఘట్ట చెరువులోకి చేపపిల్లలు వదులుతున్న అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

ఉత్కంఠ భరితంగా సూపర్ లీగ్ మ్యాచ్

అనంతపురం: సూపర్ లీగ్ క్రికెట్ టోర్నీలో భాగంగా అనంత క్రీడాగ్రామం వేదికగా ఆదివారం జరిగిన రాప్తాడు, ధర్మవరం జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన రాప్తాడు జట్టు నిర్ణీత 40 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్లు భానుప్రసాద్ 72 పరుగులు, సాత్విక్ 46 పరుగులు చేశారు. ధర్మవరం బౌలర్లలో లోక్‌నాథ్ 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 24 ఓవర్లలోనే 102 పరుగులకు కుప్పకూలింది. రాప్తాడు జట్టు 139 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రాప్తాడు బౌలర్ నిహార్ 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో రాప్తాడు జట్టు ఫైనల్ కి చేరుకుంది.


4 వికెట్లు తీసిన నిహార్

క్లుప్తంగా

ముగిసిన సుందర శ్రీకర మహాయాగం



యాగం నిర్వహిస్తున్న రుత్వికులు

అనంతపురం కల్చరల్: చంద్రశేఖరేంద్ర సరస్వతి జ్ఞానపీఠం ఆధ్వర్యంలో సుందర శ్రీకర మహాయాగం మహాపూర్ణాహుతితో ఆదివారం ముగిసింది. ఉదయం హనుమద్ వ్రతం, మన్యు సూక్త అభిషేకం, హనుమద్ అష్టదశాక్షరి హోమం, మహాపూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగాయి. చెన్నైకి చెందిన గుహానందమండలి వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ గోటేటి శ్రీనివాసరావు, మధుసూదనరావు ఆధ్వర్యంలో పండితులు, రుత్వికులు మహాయాగంలో పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఆత్మకూరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో అమరావతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ అంజె ముత్యాలన్న ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు 600 మందికి వైద్యపరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఇతర పరీక్షలు చేసి, మందులు అందించారు. అనంతరం అంజే ముత్యాలన్న మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ , ఈహెచ్‌సీ ద్వారా అనేక రోగాలకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. గుండె వ్యాధులు, మెదడు, నరాలు, కండరాల నొప్పులు, వెన్నెముక శస్త్రచికిత్స, నడుమునొప్పికి చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు రోషన్‌సాబ్, భాస్కర్‌బాబు, సాయి సుజిత్ కోర, మధుసూదన్, మాజీ జెడ్పీటీసీ బంధూక మధు, సోము, నారాయణ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: వేమన టెలిఫోన్ భవన్ షిర్డీసేవా సంఘం ఆధ్వర్యంలో షిర్డీసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో డైరీలు ఆవిష్కరించారు. మందిరం కమిటీ అధ్యక్షుడు వి.జయచంద్ర చౌదరి మాట్లాడుతూ ఏటా బాబా మందిరం డైరీని ఆవిష్కరించి భక్తులకు అందజేస్తున్నట్లు తెలిపారు.

చర్చీలకు కేక్‌ల పంపిణీ



కేక్‌లు పంపిణీ చేస్తున్న భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం రూరల్: అనంతపురంలోని పలు చర్చీలకు క్రిస్మస్ పండగను పురస్కరించుకొని భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు ఆదివారం కేక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారతీ సిమెంట్ కంపెనీ జిల్లా సేల్స్ టెక్నికల్ ఇంజనీర్ మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ క్రిస్మస్ పండగను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో కేక్‌లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు డీలర్లు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.70 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.70 లక్షలకుపైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్ బాషా, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,18,470 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1,52,200 మేర వసూలైనట్లు తెలిపారు.

ఇష్టపడి చదివితేనే సత్ఫలితాలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే సత్ఫలితాలు వస్తాయని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్సీ వసతిగృహం-4 లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. డీడీ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. పదో తరగతి పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా చదవాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారి దామోదర్‌రెడ్డి, వార్డెన్లు పాల్గొన్నారు.

సునీతకు ప్రజలు ఇప్పుడు గుర్తుకొచ్చారా?

- రాప్తాడు ప్రజలు ఓడించారని ప్రజలపై కక్ష కట్టారు..
- పరిటాల కుటుంబీకులు వేల కోట్లకు పడగలెత్తారు
- వారికి ఎమ్మెల్యే సీటు ఎక్కడ కేటాయిస్తారో దిక్కుతోచని పరిస్థితి
- వార్డు మెంబర్‌గా గెలవని వాళ్లుకూడా ప్రకాష్‌రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: 'రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాతనే అభివృద్ధి జరిగింది... ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చి ప్రజలకు అండగా నిలుస్తున్నారు.. రోజు రోజుకూ ప్రజల్లో ప్రకాష్‌రెడ్డికి ఆదరణ పెరుగుతుండడంతో ఓర్వలేక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు 'అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు,ఎంపీపీ హేమలత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో పరిటాల సునీత ఇన్ని రోజులు నిద్రపోయి ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలు గుర్తుకు వచ్చారా అని ఎద్దేవా చేశారు. కొడుకు పరిటాల శ్రీరామ్‌ను ధర్మవరం పంపించి, మళ్లీ రాప్తాడులో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వారు అధికారంలో ఉన్న 20 ఏళ్ల వేల కోట్లకు పడగలెత్తారని, హైదరాబాద్‌లో పబ్బులు కూడా నడుపుతున్నారని తెలిపారు. పరిటాల కుటుంబానికి చెందిన ఎస్‌కేసీ కంపెనీ 52 కాంట్రాక్టు పనులు తీసుకుందని, రాప్తాడు నియోజకవర్గంలో 33 రోడ్ల పనులు ప్రారంభించి, ఇప్పటికీ మూడు రోడ్లు కూడా వేయలేదని విమర్శించారు. అదే ధర్మవరంలో ఆ కంపెనీ వారు 19 రోడ్డు పనులను తీసుకొని, 16 రోడ్డు పూర్తి చేశారని, దీన్ని బట్టే రాప్తాడు అభివృద్ధిపై ఎంత ప్రేమ ఉందో పరిటాల కుటుంబానికి చెప్పవచ్చన్నారు. పరిటాల సునీత దృష్టిలో అభివృద్ధి అంటే కేవలం పరిటాల కుటుంబ అభివృద్ధి అని, వారి కుటుంబ సభ్యులు, బంధువులు వందల ఎకరాల భూములు సంపాదించారన్నారు. అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న సునీతకు కోడిగుడ్ల మంత్రిగా పేరుందని, ఇప్పటికీ వారి సోదరులు కోడిగుడ్ల వ్యాపారం చేస్తున్నారని తెలిపారు.

ఓట్లు అడిగే దమ్ము పరిటాల సునీతకు ఉందా?

నియోజకవర్గంలో ఓట్లు అడిగే దమ్ము పరిటాల సునీతకు ఉందా.. అని నాయకులు ప్రశ్నించారు. పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు మండలానికి రూ.36 కోట్లతో తాగు నీరు అందిస్తున్న ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి ఉందన్నారు. పరిటాల కుటుంబ అవినీతిని ప్రజలకు తెలియజేసినందుకు ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కరోనా సమయంలో ప్రకాష్‌రెడ్డి కుటుంబం ప్రాణాలు లెక్కచేయకుండా ప్రజల్లో తిరిగారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు, ఇళ్లు ఇస్తుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు 60 చోట్ల కోర్టులకు వెళ్లి పట్టాలు ఇవ్వరాదని అడ్డుకున్నారన్నారు. పేరూరు డ్యాంకు నీరు రాకూడదని కర్ణాటక ప్రాంత నాయకులతో చేతులు కలిపి పరిటాల సునీత కుట్ర చేస్తే, అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్పతో మాట్లాడి పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోలోని హామీలు నిజాయితీగా అమలు చేశామన్నారు. దాదాపు రూ.2,500 కోట్లతో సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చుపెట్టిందని తెలిపారు. దోపిడీకి గురవుతున్న ముత్యాలమ్మ గుడిని ప్రభుత్వానికి అప్పచెప్పారని, నియోజకవర్గంలో కొత్తగా 6 సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారన్నారు. ఇంటింటికీ కొళాయి అందిస్తూ, నీటి సమస్య పరిష్కరిస్తున్నారన్నారు. ఎక్కడా లేని విధంగా జగనన్న ఇంటి నిర్మాణాలు రాప్తాడు నియోజకవర్గంలో జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఆధారాలు లేకుండా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, 2024 లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి,నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రామునాయక్, పోతన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నియోజకవర్గంలోని క్రిస్టియన్లకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజలందరికీ యేసు క్రీస్తు కృప ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

'హర్జేనాయక్ సరెండర్ ఉత్తర్వులు నిలుపుదల చేయాలి'

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హర్జేనాయక్‌పై వచ్చిన సరెండర్ ఉత్తర్వులు నిలుపుదల చేయాలని ఆలిండియా బంజారా సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రి నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రిన్సిపల్ హర్జేనాయక్ నిజాయతీగా పనిచేస్తున్నా సరెండర్ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. వెంటనే అతన్ని ఉద్యోగంలోకి తీసుకోకపోతే గిరిజన ఉద్యోగుల సంఘం, బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాలాజీనాయక్, బాబు నాయక్, సుగుణ బాయి, శివమణి బాయి, సుశీల బాయి, రామాంజనేయులు నాయక్, పరమేష్ నాయక్ పాల్గొన్నారు.

నగరానికి మహర్దశ

- రూ.82 కోట్లతో ఎస్టీపీ, మూడు ట్యాంకులు, పైప్‌లైన్
- పరిపాలనా అనుమతి ఇచ్చిన ప్రభుత్వం
- డీపీఆర్ సిద్ధం చేసే పనిలో పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఇప్పటికే రూ.వందల కోట్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నగరంలోని మూడు ప్రాంతాల్లో త్వరలో అమృత్ 2.0 కింద నీటి ట్యాంకులు, పైప్‌లైన్, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుకు పరిపాలన అనుమతులు కూడా వచ్చాయి. డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేసే పనుల్లో పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు నిమగ్నమయ్యారు.

రూ.82 కోట్లతో అభివృద్ధి పనులు:

అమృత్ 2.0 కింద రూ.82.62 కోట్లతో మూడు నీటి ట్యాంకులు, పైప్‌లైన్, సివరేజ్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని గుత్తి రోడ్డు ఎస్ఎస్ ట్యాంక్, ఆదర్శనగర్, జనశక్తినగర్ ప్రాంతాల్లో మూడు నూతన ట్యాంకులు, దీంతో పాటు 7 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం రూ.34.62 కోట్లు వెచ్చించనున్నారు. రూ.48 కోట్లతో సెవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలో 30 ట్యాంకులు ఉన్నాయి. 50 డివిజన్లలో 42వేలకు పైగా నీటి కనెక్షన్లు ఉన్నాయి. రోజూ ముద్దలాపురం ఫిల్ట్రేషన్ పాయింట్ నుంచి 40 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరుగుతుంది. నూతనంగా నీటి ట్యాంకులు, పైప్‌లైన్ ఏర్పాటు ద్వారా ఆదర్శనగర్, గుత్తి రోడ్డు ఎస్ఎస్ ట్యాంకు, జనశక్తినగర్ శివారు ప్రాంతాల వరకు నీటి సరఫరా సమృద్ధిగా ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు వచ్చాయి. పబ్లిక్ హెల్త్ విభాగం ఇంజనీర్ల డీటైల్డ్ ప్రాజెక్ట్ నివేదిక సమర్పించాక ఈ పనులు మొదలవుతాయి.

సమృద్ధిగా నీటి సరఫరా

ప్రజల అవసరాలకనుగుణంగా నీటి సరఫరా సక్రమంగా జరుగుతోంది. అమృత్ 2.0 కింద ఎస్‌టీపీ, మూడు ట్యాంకులు, పైప్‌లైన్ మంజూరైంది. ఇప్పటికే ఎస్‌టీపీ డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేశారు. త్వరలో నీటి సరఫరాకు సంబంధించి డీపీఆర్‌ను సిద్ధం చేయనున్నాం. వీటి పనులు పూర్తయితే నీరు మరింత సమృద్ధిగా అందించొచ్చు.

– రామమోహన్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ

సర్పరూపుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష నివారణ హోమాలు నిర్వహించారు. తులసీ దామోదర చెట్టు వద్ద పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం నిర్వహించారు.

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గోవిందు

కనగానపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కనగానపల్లికి చెందిన వండ్ల గోవిందును ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రైతు సంఘం మహాసభలలో ఈ ఎంపిక జరిగినట్లు జిల్లా గౌరవాధ్యక్షులు మహదేవ ఓ ప్రకటనలో తెలిపారు. కనగానపల్లి మండల రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన గోవిందును జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఆయన తెలిపారు.

ప్లేస్‌మెంట్‌లో ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రభంజనం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ప్రభంజనం సృష్టించారు. ఏకంగా 34 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కళాశాలలో గత నెల 20, 21 తేదీల్లో ప్రముఖ గ్లోబల్ కంపెనీ అయిన యాక్సెంచర్ సమగ్ర ఆన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందన్నారు. ఇందులో కళాశాలకు చెందిన 398 మంది మొదటి రౌండ్ మూల్యాంకనం, ఆప్టిట్యూడ్ క్రిటికల్, అబ్‌స్ట్రాక్ రీజనింగ్ ప్రక్రియకు హాజరయ్యారు. అందులో 71 మంది విద్యార్థులను ఎంపిక చేసి వీరికి కోడింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్ పరీక్షలు నిర్వహించారు. చివరగా 34 మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, యాజమాన్యం అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి

ట్రెక్కింగ్‌లో విద్యార్థులు

ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ట్రెక్కింగ్‌లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్ బెల్గాం(కర్ణాటక)లో కొనసాగుతోందన్నారు. ఈ సాహస శిబిరానికి దక్షిణ భారత డైరెక్టరేట్ల నుంచి 500 మంది క్యాడెట్లు హాజరయ్యారన్నారు. ఇందులో కళాశాలకు చెందిన కార్తీక్ శ్రీమంత్, విజయ్ భాస్కర్, సి.ప్రవీణ్‌కుమార్, శేషాద్రి నాయుడు, లోకేష్, ఆదర్శ బాబు, పి. ప్రవీణ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

అభాగ్యుడికి 'అమ్మ' చేయూత

అనంతపురం కల్చరల్: పుట్టపర్తి మండలం ఎనుములపల్లికి చెందిన వెంకటేష్ కుటుంబానికి 'అమ్మ'సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. వెంకటేష్‌కు భార్య వనజ, కుమారుడు రేవంత్ ఉన్నారు. నాయీబ్రాహ్మణ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. జీవితం సాఫీగా సాగుతుండగా వెంకటేష్‌కు పక్షవాతం వచ్చి కుడిచేయి, కుడికాలు పనిచేయడం లేదు. వైద్యం కోసం డబ్బు ఖర్చు చేసుకున్నా ఫలితం లేకపోయింది. బెంగళూరులోని జయదేవ్ హాస్పిటల్‌లో 5 స్టంట్లు వేయాలని, అందుకు రూ.12 లక్షల ఖర్చవుతుందని చెప్పారు. దిక్కు తోచని వెంకటేష్ కుటుంబం 'అమ్మ' సంస్థను ఆశ్రయించింది. మానవత్వంతో స్పందించిన రమణారెడ్డి.. తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థికసాయం అందించారు. నిత్యావసర వస్తువులు, మందులు కొనుగోలు చేసి ఇచ్చారు.




వెంకటేష్ కుటుంబానికి నగదు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

క్రిస్మస్ వేడుకలకు చర్చీల ముస్తాబు

అనంతపురం కల్చరల్: నగరంలో క్రీస్తు జన్మదిన వేడుకలు సోమవారం వైభవంగా సాగనున్నాయి.ముందస్తు క్రిస్మస్ వేడుకలతో చర్చీల్లో సందడి నెలకొంది. నగరంలో ప్రార్థనా మందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రాజు రోడ్డు, అరవిందనగర్ తదితర చోట్ల క్రిస్మస్ పండుగ సామగ్రి అమ్మే దుకాణాల్లో సందడి నెలకొంది. కళాకారుల కాలనీలోని రేమా చర్చి, సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న ఎస్ఐయూ చర్చి, అరవిందనగర్‌లోని సీఎస్ఐ చర్చి, కోర్టు రోడ్డులోని గాస్పెల్ మందిరం, రాచానపల్లి క్రీస్తు ప్రార్థన మందిరం తదితర చోట్ల క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. అర్థరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్‌లతో క్రిస్మస్ పర్వదినాన్ని అందరూ ఆహ్వానిస్తున్నారు.

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరులో క్రిస్మస్ పండుగను ఏటా పెద్దఎత్తున నిర్వహిస్తారు. సోమవారం క్రిస్మస్ సందర్భంగా చర్చిని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.


రాప్తాడు: పట్టణంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకుంటారు. మండలంలో రాప్తాడులోని కరుణామయుడు (డాన్ బోస్కో) చర్చి, చిన్మయనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చిలు ముస్తాబయ్యాయి. ముండలంలో పలు పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్మయనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చి విచారణ గురువులు, ఆయా పాఠశాలల కరస్పాడెంట్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నరు.



కార్మియల్ మాత చర్చిని విద్యుత్‌దీపాలతో అలంకరించిన దృశ్యం



కార్మియల్ మాతా చర్చిలో అలంకరించిన దృశ్యం



రాప్తాడులో విద్యుత్ దీపాలతో ముస్తాబైన కరుణామయుడు చర్చి

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం



హౌసింగ్ బోర్డులో పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి



కోర్టురోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: సువర్చల సమేతుడైన హనుమంతుడు ఆదివారం విశేష పూజలందుకున్నాడు. మార్గశిరంలో వచ్చే పవిత్ర హనుమద్ వ్రతాలను పురస్కరించుకొని నగరంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. నగరంలోని కోర్టురోడ్డులో వెలసిన మహిమాన్విత వరదాంజనేయస్వామి ఆలయం , హౌసింగ్‌బోర్డులోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు హనుమద్ వ్రతాల్లో భాగంగా పూజలు, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం చేశారు. పంచామృతాభిషేకాలు, వడమాలలతో పూజలతో పాటు హనుమద్‌వ్రతం నిర్వహించారు. శివబాలయోగి ఆశ్రమం, హెచ్చెల్సీకాలనీ, రాజీవ్‌కాలనీలో, పాతూరు మండీ ఆంజనేయస్వామి ఆలయంలో, ఇందిరానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ హనుమద్ వ్రతాలు జరిగాయి.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాజకీయ పార్టీలు మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పసలూరి ఓబిలేసు తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంహెచ్ పీఎస్ ఆధ్వర్యంలో రాయలసీమ మహాసభ నిర్వహించారు. తొలుత ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఓబిలేసు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలని, భూమి లేని డప్పు కళాకారులకు ప్రభుత్వం భూమి కేటాయించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలోకూడా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అనంతరం డప్పు కళాకారుల పింఛన్ సాధన ఉద్యమంలో పని చేసిన నాయకులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ నాయకులు రఘు, శివ, రాజేష్, సన్నీ, వెంకటేసులు, ఓబులప్ప, వెంగల ఆదినారాయణ, రుద్రయ్య, వెంకట సుబ్బయ్య, ఓబులేసు, రవి, రామలింగ, కుళ్లాయప్ప, శంకరనారాయణ, అంజి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ చలిపులి



రాప్తాడులో చలి కాచుకుంటున్న ప్రజలు

- వణికిస్తున్న చలిపులి
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- విస్తరిస్తున్న సీజనల్ వ్యాధులు

రాప్తాడు : రాప్తాడులో రాత్రితో పాటు పగటి ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి. ఫలితంగా వారం నుంచి చలి తీవ్రత పెరుగుతోంది. చిన్నారులు, వృద్ధులు చలికి గజగజ వణుకుతున్నారు. గతేడాది డిసెంబర్ 15 నుంచి చలి తీవ్రత ప్రారంభం కాక, ఈ ఏడాది ఒక నెల ముందుగానే చలి పులి చంపేస్తోంది. చలి తీవ్రత అధికంగా ఉండటంతో ఎండ వచ్చిన తర్వాత లేవడం దినచర్యగా మారుతోంది. దగ్గు, ఆస్తమా, అలర్జీ, చర్మ సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయి. వ్యాధుల తీవ్రత పెరగడంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. చలి నుంచి రక్షణ పొందేందుకు మంకీక్యాప్‌లు, స్వెటర్లు, జర్కిన్లు, శాలువాలు ధరిస్తున్నారు. చలి మంటలు వేసుకొని చలి కాచుకుంటూ రాత్రి, తెల్లవారుజాము వేళల్లో ఉపశమనం పొందుతున్నారు.

చలి నుంచి రక్షించుకోండి ఇలా..

పొడి చర్మం ఉన్నవారు దగ్గు, ఆస్తమా, చర్మ సంబంధిత వ్యాధులున్నవారు చలికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయుష్ వైద్యాధికారి మల్లేశ్వరమ్మ సూచించారు. చలి నుంచి రక్షించుకుంటూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

- రోజూ సబ్బుతో కాకుండా సున్ని పిండితో మర్దన చేస్తూ స్నానం చేయాలి.
- పెట్రోలియం జెల్లీ, ఆలీవ్ ఆయిల్‌ను కాళ్లు చేతులకు, ముఖానికి రాసుకోవాలి.
- పెదాల సంరక్షణకు వెన్న లిప్‌కేర్ క్రీములు ఉదయం, సాయంత్రం రాసుకోవాలి.
- రాత్రి వేళల్లో ప్రయాణం చేసే వారు మంకీక్యాప్‌లు, జర్కిన్లు, గ్లౌజ్‌లు ధరించాలి.
- చిన్నారులు, వృద్ధులు చలికి తట్టుకోలేరు కాబట్టి చర్మం అంతా కప్పి ఉంచేలా దుస్తులు ధరించడం ఉత్తమం.
- తాజా పండ్లు, కూరగాయలు, క్యారెట్ అధిక మోతాదులో తీసుకోవాలి.
- ఉప్పు, చక్కెర కొవ్వు ఆధారిత పానీయాలు తగ్గించాలి.
- రోజూ ఎనిమిది గ్లాసుల మంచి నీళ్లు తాగాలి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం..

- దుమ్మూధూళీ, బ్యాక్టీరియా, ఫంగస్ ఎలర్జీ కారకాలకు దూరంగా ఉండాలి.
- పొగ తాగరాదు, పొగ నిండిన గదుల్లో ఉండరాదు.
- అనవసర శారీరక శ్రమ చేయరాదు.
- శీతల పానీయాలు, ఐస్‌క్రీంలు అసలు మంచివి కావు.
- చలి తేమను తప్పించుకుని వీలైనంత వరకు పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలి.
- రాత్రి వేళలో నిద్రిస్తున్న సమయంలో తల వైపు రెండు దిండ్లు ఎత్తుగా అమర్చుకోవాలి.
- వైద్యుల సూచనల మేరకు సిరప్ తీసుకోవాలి.
- ధ్యానం, యోగా సాధన ద్వారా ఆస్తమాను అదుపులో పెట్టుకోవచ్చు.

పెరిగిన స్వెట్టర్ల ధరలు..

చలిని తట్టుకునేందుకు పట్టణ, గ్రామీణ ప్రజలు స్వెట్టర్లు కొనేందుకు ఎగబడుతుండటంతో ధరలు పెరిగిపోయాయి. ఒక్కొక్కటి రూ. 600 నుంచి రూ.800 వరకు ధర పలుకుతున్నాయి. దీంతో వాటిని కొనలేక, చలిలోనే కాలం వెల్లదీస్తున్నారు. చలి తీవ్రంగా ఉండటంతో పలువురు మార్నింగ్ వాక్‌కు గుడ్‌బై చెప్పేశారు.